క్లుప్తంగా

ఇసుక అక్రమ తరలింపుపై ఫిర్యాదు



గనులు భూగర్భ జలవనరుల శాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్న మొలకవారిపల్లె ప్రజలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పెన్నానది నుంచి ఇసుక అక్రమ తరలింపుపై కమలాపురం మండలం సంబటూరు గ్రామ పంచాయతీ మజరా గ్రామం మొలకవారిపల్లె ప్రజలు సోమవారం గనులు భూగర్భ జలవనరుల శాఖ అధికారి సూర్యచంద్రరావుకు ఫిర్యాదు చేశారు. గంగవరం పంచాయతీ విభరాపురం గ్రామ సమీపంలోని పెన్నానదిలో ప్రభుత్వం ఇసుక క్వారీని గుర్తించిందన్నారు. అయితే కొందరు అనధికారికంగా తమ గ్రామ సమీపంలోని పెన్నానదిలో జేసీబీలు, హిటాచిలతో ఇసుకను తవ్వుతూ టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారని తెలిపారు. ఇందువల్ల తమ గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు, పాయింట్లు దెబ్బతిన్నాయన్నారు. తద్వారా తాగునీటి సమస్య ఏర్పడుతోందన్నారు. ఇసుక లోడుతో భారీ వాహనాలు తిరుగుతున్నందువల్ల పశువుల మేత, పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. పలు కారణాల వల్ల గతంలో తమ గ్రామంలో ఏర్పాటు చేయాలనుకున్న క్వారీ నిర్ణయాన్ని అప్పటి తహసీల్దార్ తిరస్కరించారన్నారు. కనుక తమ గ్రామ సమీపం నుంచి ఇసుక అక్రమంగా తరలించకుండా, ప్రభుత్వం గుర్తించిన అధికారిక క్వారీ ద్వారానే ఇసుకను తీసుకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పాత రిమ్స్‌లో ఉన్న అల్-షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, గౌస్ పీర్, హరిప్రసాద్, సుశీల్ కుమార్, డాక్టర్ అన్వర్, మైనుద్దీన్, శ్యామలమ్మ, సంజయ్ కాంత, నాగరత్నగౌడ్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వం, సంప్రదాయం ప్రతిబింబించాలి



మన చరిత బులిటెన్‌ను ఆవిష్కరిస్తున్న బయ్యా వాసు

కడప కల్చరల్ : మన పెద్దలు మనకు అందజేసిన ఘనమైన వారసత్వాన్ని కాపాడడంతో పాటు దైనందిన జీవితంలో సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని శుభమస్తు గ్రూప్ ఆఫ్ షాపింగ్‌మాల్స్ అధినేత బయ్యా వాసు అన్నారు. స్థానిక శుభమస్తు షాపింగ్ మాల్‌లో సోమవారం భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో విడుదలైన మన చరిత డిసెంబరు బులిటెన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రాలనే ఎక్కువగా ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. తమ ప్రకటనలలో కూడా జిల్లా ఘనత, సాంస్కృతిక వారసత్వ విశేషాలు, స్థానిక పర్యాటక ప్రదేశాల గురించి ప్రచారం చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ప్రతినెల జిల్లాలోని వారసత్వ ప్రాంతాలు, మనవైన సంస్కృతి సంప్రదాయాలు గురించిన విశేషాలతో బులిటెన్‌ను ప్రచురిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించినా.. వినియోగించుకోరేం..!



దేవాలయం సమీపంలో నిరుపయోగంగా ఉన్న బాత్ రూములు



ఆలయం పక్కనే వినియోగానికి సిద్ధంగా ఉన్న బాత్‌రూము

- బాత్‌రూములు సిద్ధం
- ప్రారంభానికి నోచుకోని వైనం
- ఎదురుచూస్తున్న భక్తులు

కడప కల్చరల్ : ఇప్పటికే నిర్మాణం పూర్తయి దాదాపు మూడు నెలలకు పైగా గడిచినా.. వినియోగంలోకి రాని బాత్‌రూములను ఇకనైనా తెరిపించాలని భక్తులు కోరుతున్నారు. దేవుని కడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం దక్షిణ ప్రహరీ పక్కనే ఇంతకుముందు చాలా ఏళ్లుగా ఉండిన బాత్‌రూముల స్థానంలో ఇటీవల నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నూతన గదులను నిర్మించారు. అంతకుముందు ఉండిన బాత్‌రూములు చాలా ఏళ్లుగా భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఈ గదులు మినహా చుట్టుపక్కల మరెక్కడా బాత్‌రూముల సౌకర్యం లేకపోవడంతో వారు వీటిపైనే ఆధారపడ్డారు. పాత గదులు శిథిలమవుతున్న విషయాన్ని గమనించిన నగరపాలక సంస్థ అధికారులు స్థానిక భక్తులు, ప్రముఖుల వినతుల మేరకు చొరవ తీసుకుని వాటి స్థానంలో నూతన గదులను అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చారు. షుగర్ వ్యాధి గల వారికి చలికాలం వీటి అవసరం ఎక్కువ గనుక వాటిని చలికాలం సీజన్ నాటికి వినియోగంలోకి తెస్తారని భక్తులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. నూతన గదులు నిర్మించి మూడు నెలలు గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తేకపోవడం వారిని తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది.

బ్రహ్మోత్సవాల నాటికైనా..

ఇప్పటి నుంచి ఐదు వారాల తర్వాత దేవుని కడప రాయుని ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. నగరవాసులే గాక చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు దాదాపు లక్ష మంది పది రోజులపాటు ఈ ఉత్సవాలకు హాజరు కానున్నారు. అలాంటి సమయంలో ఈ బాత్‌రూములు ఎంతో ఉపయోగకరంగా ఉండగలవు. ఆలయానికి ఎటూ ప్రత్యేకంగా బాత్ రూములు లేవు. స్థలం సమస్య కారణంగా ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రానికి ఒక్కటంటే ఒక్క బాత్‌రూము కూడా లేకపోవడం గురించి అందరికీ తెలిసిందే. ఎన్నో ఏళ్లపాటు సేవలందించిన ఈ బాత్‌రూములు పునర్ నిర్మించబడి భక్తుల సేవల కోసం సిద్ధం కావడం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ వాటిని వినియోగంలోకి తేవడంలో జరుగుతున్న జాప్యానికి తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ఈ ఐదు వారాలలోనైనా పూర్తి చేసి కనీసం బ్రహ్మోత్సవాల సమయానికి భక్తులకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. దీంతోపాటు దేవుని కడప చెరువు వద్ద, పర్యాటక భవనానికి ఎదురుగా కూడా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బాత్‌రూము గదులు నిర్మించారు. అవి పూర్తయి కూడా మూడు నెలలకు పైగా గడుస్తున్నా వాటిని కూడా ఇంతవరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఎక్కువ సమయం అలాగే వదిలేస్తే ఆ భవనాలు ఉపయోగంలోకి రాకముందే శిథిలమయ్యే ప్రమాదం ఉందని భక్తులు సూచిస్తున్నారు. వాటిని త్వరగా కనీసం బ్రహ్మోత్సవాల సమయంకైనా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్



బ్రౌన్ గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కల్చరల్ : జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ప్రముఖ సరస్వతీ నిలయమైన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించారు. బ్రౌన్ కేంద్ర సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి ఆయనకు గ్రంథాలయంలోని మూడు అంతస్తుల్లోని పుస్తక, తాళపత్ర, పరిశోధక విభాగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా పుస్తక విభాగాన్ని, అక్కడున్న అదనపు పుస్తకాలను క్రమపద్ధతిలో అమర్చాలని సూచించారు. నూతన భవన నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని కూడా కలెక్టర్‌కు చూపి వాటి నిర్మాణానికి నిధులకు సంబంధించిన పనుల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంజినీరింగ్ విభాగ అధికారులను, గ్రంథాలయ అదనపు భవన నిర్మాణాలకు సంబంధించి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు.

'బ్రౌన్' నిధుల బదలాయింపు

బ్రౌన్ గ్రంథాలయం నూతన భవనాలకు సంబంధించిన రూ.3.60 కోట్లను యోగి వేమన విశ్వవిద్యాలయ అధికారులు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీయూ డబ్ల్యూఐడీసీ)కు బదిలీ చేశారు. దీంతో నూతన భవన నిర్మాణాలకు సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది.

సీమ అభివృద్ధి కోసం అవిశ్రాంత పోరాటం



పార్టీ జెండా ఆవిష్కరణలో ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమ అభివృద్ధి కోసం అవిశ్రాంత పోరాటం చేస్తామని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంతోపాటు వివిధ ప్రాంతాల్లో జెండాలు ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ ప్రాంతాన్ని ఇంత వరకు పాలించిన అన్ని పార్టీలు విస్మరించాయని విమర్శించారు. ఓట్లు, సీట్లు తక్కువ ఉన్న కారణంగానే ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. అధికారంలో ఉన్నది రాయలసీమ వారైనా, అభివృద్ధి అంతా తెలంగాణ, కోస్తాలో జరిగిందన్నారు. రాయలసీమలోని సమస్యలు ఎవరికీ పట్టడం లేదని, వాటిని గుర్తించడానికి, సమస్యల పరిష్కారం దిశగా పని చేయటానికి రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందన్నారు. గడచిన ఎనిమిది సంవత్సరాలు రాయలసీమ అభివృద్ధి కోసం తన శక్తికి మించి వీరోచితమైన పోరాటాలు నిర్వహించిందన్నారు. అందులో ముఖ్యమైనవి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని 360 రోజులు ఉక్కు నిరాహార దీక్షలు, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు కోసం రాయలసీమ వ్యాప్తంగా 1200 కిలోమీటర్ల బైక్ యాత్రలు, అనంతపురంలోని భైరవాణి తిప్ప ప్రాజెక్టు కోసం పాదయాత్రలు, సెంట్రల్ యూనివర్సిటీ కోసం నిరాహార దీక్షలు, స్థానిక సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్ బాషా, ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, తస్లీమ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ కోసం నిరవధిక ఉద్యమం



కలెక్టరేట్ వద్ద డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

కడప సెవెన్‌రోడ్స్ : ఉక్కు పరిశ్రమ కోసం నిరవధిక ఉద్యమం సాగిస్తామని విద్యార్థి, యువజన సంఘం నాయకులు తెలిపారు. కడప ఉక్కుపై పార్లమెంటులో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి వ్యాఖ్యలు నిరసిస్తూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద వినూత్న రీతిలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు పైన కేంద్ర వైఖరి దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారుతున్నా కడప ఉక్కు రాత మారడం లేదన్నారు. వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలలో భారీ ఉక్కు పరిశ్రమ చాలా అవసరమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడిచిన పది సంవత్సరాలలో కడప ఉక్కుకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదన్నారు. తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రంలోని ఎంపీలు సైతం పార్లమెంటులో కడప ఉక్కు పైన మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని ఎదిరించి కడప ఉక్కుకు నిధులు రాబట్టలేక పోతోందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయంగానే చూస్తున్నారు కానీ ఇక్కడి యువత భవిష్యత్‌ను ఆలోచించడం లేదన్నారు. రాష్ట్ర ఎంపీలు కడప ఉక్కుపై గళం విప్పాలని, అవసరం అయితే తమ పదవులకు రాజీనామా చేసి కేంద్రం పైన ఒత్తిడి తేవాలని సూచించారు. తమ పోరాటాలలో భాగస్వామ్యం కావాలని ప్రజా ప్రతినిధులకు పిలుపునిస్తున్నామని, లేనిపక్షంలో ఇక్కడి యువత తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్, ఎద్దు రాహుల్, వీరపోగు రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న సీపీ బ్రౌన్ వర్ధంతి సభ

కడప కల్చరల్ : తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ 141వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సభ నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు బ్రౌన్ గ్రంథాలయంలో జరగనున్న సభకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహిస్తారని, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సి.పద్మ విశిష్ట అతిథిగా, నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి గౌరవ అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9.40కి స్థానిక రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి పూలమాల అలంకరిస్తామని వివరించారు.

నోటుపుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాల పంపిణీలో మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు

వైవీయూ : కడప నగరంలోని నాగరాజుపేట నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సోమవారం జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, కాపీరైటింగ్ పుస్తకాలు, పెన్నులు, చాకెట్లు, రైటింగ్ మెటీరియల్స్ అందజేశారు. త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్మీ ఫ్లాగ్ డే ఫండ్‌ను ప్రజా విరాళాలతో కాకుండా ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుల ద్వారా సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నిరంజన్‌ప్రభు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్

కడప కార్పొరేషన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయని దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిశోర్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తరతరాలుగా దళితులు ఎదుర్కొంటున్న అవమానాలకు అడ్డుకట్ట వేయగల ఆయుధం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టమేనన్నారు. ఈ చట్టం ఉందన్న భయంతోనైనా వివక్ష, దాడులు కొంత మేరకు తగ్గే అవకాశం ఉందన్నారు. కానీ కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థ బుద్ధి, తప్పుడు విధానాల వల్ల ఈ చట్టానికి ముప్పు పరిణమించిందన్నారు. దళిత, గిరిజనులంతా ఏకమై ఈ చట్టాన్ని కాపాడుకోక లేకపోతే ఇక వారికి రక్షణే ఉండదని హెచ్చరించారు. రాజకీయ ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రతి ఒక్కరూ ఈ చట్ట పరిరక్షణకు కలిసిరావాలన్నారు. ఈ చట్టం పట్ల అవగాహన పెంచుకొని సమర్థవంతంగా వినియోగించుకొని వివక్ష, దాడుల నుంచి రక్షణ పొందాలన్నారు. అంతేగాక క్రీమీలేయర్ పేరుతో దళితులను మళ్లీ పేదరికంలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని, కులాల్ని చీల్చి రాజకీయ లబ్ధి పొందే ఉద్దేశంతోనే దళితులతో రాజకీయ చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. దళిత, గిరిజనుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. క్రీమీలేయర్ వల్ల సరైన, అర్హుడైన అభ్యర్థి లభ్యం కాలేదన్న కారణంతో రిజర్వ్‌డ్ పోస్టులను భర్తీ చేయకుండా వదిలివేసే ప్రమాదం ఉందన్నారు. 'క్రీమీ లేయర్' నిబంధనను ప్రవేశపెట్టడం వల్ల యోగ్యులైన అభ్యర్థుల లభ్యత తగ్గిపోతుందని, రిజర్వ్‌డ్ పోస్టులు జనరల్ కేటగిరీకి బదలాయించే అవకాశమూ లేకపోలేదన్నారు. ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల నుంచి దళితులు క్షేమంగా ఉండాలంటే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలన్నారు. లేని పక్షంలో పూర్వ పరిస్థితులనే మళ్లీ ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో దళిత ఫోరం నాయకులు కరుణాకర్, అఖిల భారత అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ పి.పెంచలయ్య పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయల కాలనీలో నివాసముంటున్న రామసుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇంటిలో సోమవారం పట్టపగలే రూ.2 లక్షల బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. రామసుబ్బారెడ్డి తన కుటుంబ సభ్యులతో సొంత పనిపై నగరంలోకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగిలిపోయి వుండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటిలో పరిశీలించగా పై తెలిపిన మేరకు రెండు తులాల బంగారు ఆభరణాలు, రెండు లక్షల నగదును అపహరించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి తెలియజేశారు.

వేర్వేరుగా ఇద్దరు అదృశ్యం



దుర్గాప్రసాద్ (ఫైల్)



చంద్రకళ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో రెండు వేర్వేరు ప్రదేశాలలో నివాసం వుంటున్న వారు అదృశ్యమైనట్లు వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

- శాంతినగర్‌లో నివాసం వుంటున్న దుర్గాప్రసాద్ (40) అక్టోబర్ 15 నుంచి కనిపించడం లేదని అతని భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు. బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించే వాడు. హైదరాబాద్‌లో బేల్దారి పనులకు వెళ్లి నెలకు ఒకసారి వచ్చేవాడు. అక్టోబర్ 15న వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.
- కడప రిమ్స్ పీఎస్ పరిధిలోని తిలక్‌నగర్‌లో నివాసం వుంటున్న చంద్రకళ(15) అనే బాలిక ఈ నెల 8 తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి రెడ్డెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక 9వ తరగతి వరకు చదువుకుంది. చదువును మధ్యలోనే మానేసి నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఈనెల 8న బట్టల దుకాణానికి వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వారిని కుటుంబ సభ్యులు విచారణ చేశారు. వీరి ఆచూకి తెలిసిన వారు 9121100523 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థలో మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా మాట్లాడుతూ ఆప్కాస్‌లో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఒక నెల వేతనం, డైలీ వేజ్ కార్మికులకు మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. గత ప్రభుత్వ సమ్మె కాలంలో అధికారులు చేసుకున్న ఒప్పందాలు, మినిట్స్‌లో ఉన్న వాటిని అమలు పరచాలని, ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 21000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం వారు కమిషనర్ మనోజ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు మద్దిలేటి, యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు, నగర ఉపాధ్యక్షులు కంచుపాటి జాన్, నాయకులు చంద్ర జనార్దన్, ఈశ్వరయ్య, విజయ్, వికాస్, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేతకు పట్టం కట్టిన ఉపాధ్యాయులు

- ఎమ్మెల్సీగా యూటీఎఫ్ నేత గోపి గెలుపు హర్షణీయం



ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు లక్ష్మయ్య వర్ధంతి కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉభయగోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ రాష్ట్ర ట్రెజరర్ బొర్రా గోపి మూర్తి మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలవడం పట్ల యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన గోపి మూర్తి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 ఉపాధ్యాయ సంఘాలు ఒకవైపు యూటీఎఫ్ ఒకటి ఒకవైపు పోటీలో నిలవడం జరిగిందని తెలిపారు. ఎన్నో ప్రలోభాలకు గురిచేసినప్పటికీ ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు ఉద్యమ నాయకునివైపు మొగ్గి ఉద్యమాలకు ఊపిరిలా దారన్నారు. కార్యక్రమంలో సహాధ్యక్షురాలు సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు ఏజాస్ అహ్మద్, సీవీ రమణ, రాష్ట్ర కౌన్సిలర్స్ కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు సమీర్ బాషా, గోపీనాథ్, చంద్రశేఖర్, అబ్దుల్ గని, కరిముల్లా, శంకర్‌రెడ్డి, శివకుమార్ రాజు, శివశంకర్, బాబు, జి.వెంకటసుబ్బయ్య, జమాల్ బాషా, దేవదత్తం తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పారదర్శక విచారణ చేయడం ద్వారా, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఇందులో మొత్తం 30 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి -12, టౌన్‌ప్లానింగ్-4, రెవెన్యూ విభాగం-9, హెల్త్ విభాగం-3, ఎస్టాబ్లిష్‌మెంట్-1, యూపీయే విభాగం-1 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, సిటీప్లానర్ రమణ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లో ఉద్యోగులు

నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించే కార్యక్రమాన్ని కమిషనర్ మనోజ్‌రెడ్డి చేపట్టారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు కమిషనర్ వెంటనే ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్‌లో మునిగిపోయారు. వీరి తీరుపై అర్జీదారులు అసంతృప్తికి గురయ్యారు. ఎంతో వ్యయప్రయాల కోర్చి తాము ఇక్కడికి వస్తే.. అధికారుల ప్రవర్తన ఇలా ఉండటం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలపై చూపించే శ్రద్ధ ఇదేనా అంటూ మండిపడ్డారు. - సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప





